# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ.బి.సి.నేస్తం పథకం అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.**

2. **రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తెలిపారు.**

3. **రాష్ట్రంలో 2023-24 సీజన్‌కు జొన్న, మొక్కజొన్న కొనుగోలు ప్రారంభమైంది.**

4. **రాష్ట్రంలో ఈ నెల 18వ తేదీ నుండి ఒంటి పూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశించింది.**

5. **మూత్రపిండాల వ్యాధుల అవగాహనా దినాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

రాష్ట్రంలో వై.ఎస్.ఆర్. ఈ.బి.సి.నేస్తం పథకం ద్వారా పేద మహిళల కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా బనగానపల్లెలో వై.ఎస్.ఆర్. నేస్తం ఈబిసి పథకం కింద 4 లక్షల 19 వేల 583 మంది లబ్ధిదారుల ఖాతాలలో 629 కోట్ల 37 లక్షల రూపాయల మొత్తాన్ని ఆయన ఈరోజు జమ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో సింహ భాగం పేద మహిళలకే అందుతోందని ముఖ్యమంత్రి పేర్కొంటూ.....

వాయిస్ - 32 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణనే వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రధానోద్దేశమని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా న్యాయ విశ్వవిద్యాలయం భవన నిర్మాణ పనులకు ఈరోజు ఆయన భూమిపూజ చేశారు. లా విశ్వవిద్యాలయ పైలాన్‌ను కూడా ఆవిష్కరించారు. కల్లూరు మండలం లక్ష్మీపురం జగన్నాథగట్టులో 150 ఎకరాలలో వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో ఈ న్యాయ విశ్వవిద్యాలయ నిర్మాణం జరగనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని... ఈ ఒప్పందంలో భాగంగా ఈ ప్రాంతానికి న్యాయం జరిగేందుకు జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం దోహదం చేస్తుందని వెల్లడించారు.

--------------------------

వేసవికాలంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం

రొంపిచర్ల మండలంలో రెండు నూతన సబ్ స్టేషన్లను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యుత్ కోతలు ఉంటాయన్న అపోహ ప్రజల్లో నెలకొందని... అయితే విద్యుత్ కోతలు ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

--------------------------

రాష్ట్రంలో 2023-24 రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్నలను వచ్చే మే 31వ తేదీ వరకు కొనుగోలు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. జొన్నల కొనుగోలు నిన్నటి నుండి ప్రారంభం కాగా... మొక్కజొన్న కొనుగోలును ఈరోజు నుండి ప్రారంభించినట్టు తెలిపింది. మొక్కజొన్న క్వింటాలుకు 2 వేల 90 రూపాయల చొప్పున 85 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని... ప్రజల అవసరాలకు వినియోగించే జోన్నలను క్వింటాలుకు 3 వేల 180 రూపాయలు, పరిశ్రమలకు వినియోగించే జొన్నలను క్వింటాలుకు 2 వేల 90 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తామని ప్రభుత్వం వివరించింది. ఆధార్ అనుసంధానంతో సిఎం యాప్ ద్వారా రైతులకు చెల్లింపులు జరుగుతాయని ప్రభుత్వం పేర్కొంది.

--------------------------

'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' పేరిట దేశంలో అన్నిరకాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే ప్రతిపాదనపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ అధ్యయనం జరిపింది. ఈ నివేదికను ఈరోజు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సమర్పించింది. ఈ ఉదయం రామ్‌నాథ్ కోవింద్ సహా కమిటీ సభ్యులు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి... జమిలి ఎన్నికలపై నివేదికను రాష్ట్రపతికి అందజేశారు.

--------------------------

జాతీయ రహదారులపై ప్రయాణానికి సంబంధించి పేటిఎం ఫాస్ట్ ట్యాగ్‌ను తక్షణమే మార్చుకోవాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ-ఎన్.హెచ్.ఏ.ఐ సూచించింది. రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు పేటిఎం పేమెంట్స్ బ్యాంకు ద్వారా మార్చి 15వ తేదీ తరువాత నగదు లావా దేవీలను నిర్వహించలేమని... దీనివల్ల వినియోగదారులు పేటిఎం ఫాస్ట్ ట్యాగ్‌ను రీఛార్జ్ చేయలేరని పేర్కొంది పేటిఎం ఫాస్ట్‌ట్యాగ్‌లోని చివరి రూపాయి వరకు వినియోగించుకునే అవకాశం వుందని ఎన్.హెచ్.ఏ.ఐ వివరించింది.

--------------------------

రాష్ట్రంలో ఈనెల 18వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల 45 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పాఠశాలలు నిర్వహించాలని ఆదేశించారు. ఏప్రిల్‌లో నెలలోని రెండో శనివారం పాఠశాలలు పని చేయాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఆరుబయట, చెట్ల కింద తరగతులు నిర్వహించవద్దని సూచించారు. పదో తరగతి పరీక్షల కేంద్రాలైన పాఠశాలలకు 18 నుంచి 23వ తేదీ వరకు సెలవులు ఉంటాయని... ఈ ఆరు రోజులకు బదులుగా ఈనెల మార్చి 24, 31, ఏప్రిల్ 7, 13, 14, 21 తేదీల్లో తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అధికారులను ఆదేశించారు.

--------------------------

మూత్ర పిండాల వ్యాధుల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా మూత్ర పిండాల అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ మూత్ర పిండాల సొసైటీ-ఐ.ఎస్.ఎన్, అంతర్జాతీయ మూత్ర పిండాల ఫెడరేషన్ ఫౌండేషన్-ఐ.ఎఫ్.కె.ఎఫ్. ఆధ్వర్యంలో 2006 సంవత్సరం నుండి ఈ కార్యక్రమం జరుగుతోంది. మానవ శరీరంలో మూత్రపిండాలు ఒక ముఖ్యభాగం. మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసి శరీర భాగాలకు సరఫరా చేయడంలో మూత్రపిండాలు గణనీయమైన పాత్ర పోషిస్తాయి. మూత్ర పిండాలు సక్రమంగా పని చేయాలంటే ముందు చక్కెర, రక్త పోటు సమస్యలు రాకుండా జాగ్రత్త వహించాలని...

ధూమపానం, మద్యపానానికి దూరంగా వుండాలని ఉప్పు, చక్కెర తక్కువగా వుండే ఆహారం, పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు అధికంగా తీసుకోవాలని... క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని కూడా వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో రేపు నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ ఈనెల 16వ తేదీకి వాయిదా పడింది. 16వ తేదీ సాయంత్రం జరిగే ఈ బహిరంగ సభలో తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారని ఎ.పి.సి.సి. ఒక ప్రకటనలో వెల్లడించింది.

---------------------------

విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉన్నతమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి పేర్కొన్నారు. తిరుపతిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన అందిస్తూ... కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ కళాశాలలను మెరుగుపరచి విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

రానున్న ఎన్నికల్లో 18 ఏళ్ళు నిండిన యువత ఖచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. తిరుపతిలో ఆయన ఈరోజు ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఓటు ప్రజల హక్కు అని... దానిని మన బాధ్యతగా గుర్తించి రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలని అన్నారు. ఓటు హక్కు వినియోగంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొంటూ......

వాయిస్ – 35 సెకన్లు

---------------------------

వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రయోగశాల భవనాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. శాస్త్రవేత్తల సలహాలు సూచనల మేరకు ఎరువులను తగిన మోతాదులో మాత్రమే వాడాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి రైతులు నాణ్యమైన ఉత్పత్తులు పండించాలని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

======================